క్లుప్తంగా

అమ్మవారికి పంచామృతాభిషేకాలు



అమ్మవారికి పంచామృతాభిషేకాలు నిర్వహిస్తున్న అర్చకుడు

విజయనగరం రూరల్: మండలంలోని దుప్పాడ గ్రామంలో వెలసి ఉన్న శ్రీక్షేత్రంలో విజయలక్ష్మీ అమ్మవారికి గురువారం పంచామృతాభిషేకాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకులు చామర్తి రమేష్, ఆలయ ధర్మకర్తలు దుర్గాబాలాజీ, ఉమాదేవి దంపతులు పాల్గొన్నారు.

8న అన్న క్యాంటీన్ ప్రారంభం

నెల్లిమర్ల: నియోజకవర్గ కేంద్రమైన నెల్లిమర్ల పట్టణంలో ఈ నెల 8వ తేదీన అన్న క్యాంటీన్ ప్రారంభించనున్నారు. స్థానిక మున్సిపల్ కార్యాలయం సమీపంలోని ప్రధాన రహదారిలో క్యాంటీన్ నిర్వహణ కోసం ఇప్పటికే నూతన భవనాన్ని నిర్మించారు. భవనంలో క్యాంటీన్‌ను ఎమ్మెల్యే లోకం నాగ మాధవి ప్రారంభించనున్నారు. జిల్లా ఇన్‌చార్జి మంత్రి అనిత, జిల్లా మంత్రి శ్రీనివాస్ హాజరుకానున్నారు. ఈ మేరకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు మున్సిపల్ కమిషనర్ కె.అప్పలరాజు తెలిపారు. కౌన్సిలర్లు, అధికారులు హాజరు కావాలని ఆయన కోరారు.

నేటి నుంచి రెవెన్యూ సదస్సులు

పూసపాటిరేగ : గ్రామాల్లో శుక్రవారం నుంచి జనవరి 6వ తేదీ వరకు జరగబోయే రెవెన్యూ సదస్సులు విజయవంతం చేయాలని తహసీల్దార్ తాడ్డి గోవింద కోరారు. తన కార్యాలయంలో రెవెన్యూ సదస్సులపై వీఆర్ఓలు, సర్వేయర్లుతో అవగాహన సదస్సు గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల పరిధిలో అపరిష్కృతంగా వున్న భూ సమస్యల పరిష్కారానికి రెవెన్యూ సదస్సులు దోహదం చేస్తాయన్నారు. గ్రామ స్థాయిలో జరగబోయే సదస్సుకు అన్ని రాజకీయ పార్టీల నాయకులతో పాటు రైతులను గ్రామాలలో జరగబోయే షెడ్యూల్ ప్రకారం ఆహ్వానించాలని సూచించారు. సమావేశంలో డిప్యూటీ తహసీల్దార్ రమేష్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ పివి.మాధురి, సర్వేయర్ గణపతిరావు తదితరులు పాల్గొన్నారు.

నెల్లిమర్లలో..

నెల్లిమర్ల: మండలంలో శుక్రవారం నుంచి రెవెన్యూ సదస్సులు నిర్వహించనున్నట్లు తహసీల్దార్ బి సుదర్శనరావు గురువారం తెలిపారు. సదస్సులను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.

భోగాపురంలో..

భోగాపురం: మండల వ్యాప్తంగా అన్ని రెవెన్యూ గ్రామాల్లో శుక్రవారం నుంచి జనవరి 8 వరకు జరిగే రెవెన్యూ సదస్సులను విజయవంతం చేయాలని తహసీల్దార్ ఎం.సురేష్ సిబ్బందిని ఆదేశించారు. తన కార్యాలయంలో ఆయన రెవెన్యూ సిబ్బందితో గురువారం సమావేశమయ్యారు. భూములకు సంబంధించిన సమస్యలు ఉంటే అధికారుల దృష్టికి తీసుకురావాలన్నారు. సమావేశంలో డిప్యూటీ తహసీల్దార్ సుభాష్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ ఇమ్రాన్, సిబ్బంది పాల్గొన్నారు.

పరిశోధనల వ్యాప్తికి పేటెంట్ ప్రచురణలు కీలకం

విజయనగరం అర్బన్: పరిశోధనల ఆవిష్కరణల వ్యాప్తికి పేటెంట్ ప్రచురణలు కీలకంగా నిలుస్తాయని స్కూల్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ ఒడిశా డీన్ డాక్టర్ ప్రఫుల్లకుమార్ పాండా, పేటెంట్ అటార్నీ సంప్రతి బసంత్ అన్నారు. స్థానిక గాజులరేగ సీతం ఇంజినీరింగ్ కళాశాలలో 'పేటెంట్ ప్రచురణ' అంశంపై గురువారం జరిగిన అవగాహన సదస్సుకు వారు ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పేటెంట్స్ ప్రచురణ, హక్కులపై చర్చించారు. పరిశోధన అభివృద్ధికి పేటెంట్లు ఆర్థిక సామర్థ్యాలను ప్రోత్సాహకాలుగా అందిస్తాయన్నారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ డాక్టర్ మజ్జి శశిభూషణరావు, ప్రిన్సిపాల్ డాక్టర్ డీవీ రామమూర్తి, వైస్ ప్రిన్సిపాల్ అడ్మినిస్ట్రేషన్ డాక్టర్ దామోదర నాయుడు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

క్యాంపస్ డ్రైవ్‌లో 20 మందికి ఉద్యోగాలు

గాజులరేగ సీతం ఇంజినీరింగ్ కళాశాలలో సూర్య టెక్ సొల్యూషన్స్ సంస్థ గురువారం నిర్వహించిన క్యాంపస్ డ్రైవ్ ద్వారా 20 మంది విద్యార్థులకు ఉద్యోగావకాశాలు లభించాయని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డీవీ రామమూర్తి తెలిపారు. తొలి జూమ్, గ్రూప్ డిస్కషన్స్ మరియు ఇంటర్వ్యూ ప్రక్రియలను నిర్వహించి ఎంపిక చేపట్టారని తెలిపారు. వార్షిక ఆదాయం రూ.3 లక్షల వేతనాలతో ఉద్యోగావకాశాలను కల్పించారని తెలిపారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ డాక్టర్ మజ్జి శశిభూషణరావు, సూర్య టెక్ సొల్యూషన్స్ సంస్థ ప్రతినిధి సతీష్, విశాఖ బ్రాంచ్ ప్రతినిధి హర్ష, డీన్ ప్లేస్‌మెంట్స్ మరియు విభాగాధిపతులు పర్యవేక్షణలో పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కారమయ్యేనా..!

- నేటి నుంచి నగరంలో రెవెన్యూ సదస్సులు
- ప్రతి రోజు ఉదయం 9 గంటల నుంచి 2 గంటల వరకు సదస్సుల నిర్వహణ



రెవెన్యూ సదస్సుల నిర్వహణపై మాట్లాడుతున్న కమిషనర్, తహసీల్దార్

విజయనగరం: భూ వివాదాల పరిష్కారం కోసం ప్రభుత్వం నిర్వహించ తలపెట్టిన రెవెన్యూ సదస్సులు శుక్రవారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రెవెన్యూ శాఖ వారి ఆదేశాల మేరకు ఈ నెల 6 నుంచి వచ్చే నెల జనవరి 8 వరకు 30 రోజుల పాటు ఈ సదస్సులు నిర్వహించనున్నారు. జిల్లా కేంద్రంలోని విజయనగరం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో సదస్సుల నిర్వహణకు ప్రత్యేక అధికారిగా కార్పొరేషన్ కమిషనర్ వ్యవహరించనున్నారు. నగరంలో 6వ తేదీన ప్రజాప్రతినిధుల సమక్షంలో ప్రారంభమయ్యే సదస్సులు మొదటి రోజు 6వ తేదీన కణపాక, అయ్యన్నపేట పరిధికి సంబంధించి బొబ్బాదిపేట సచివాలయ ప్రాంతంలో రాజవీధి రచ్చబండ వద్ద నిర్వహించనున్నారు. అలాగే 7వ తేదీన కె.ఎల్ పురం పరిధిలో ఉన్న కమ్యూనిటీ హాల్‌లో, 9వ తేదీన విజయనగరం బిట్ - 1 తోటపాలెం రామమందిరం వద్ద, 10వ తేదీన విజయనగరం బిట్ -2 రామమందిరం వద్ద, 11వ తేదీన ధర్మపురి ప్రాంతంలో పంచాయతీ కార్యాలయం వద్ద, 12వ తేదీన వేణుగోపాలపురం బిట్ 1, 2 పరిధికి సంబంధించి రామమందిరం వద్ద, 13వ తేదీన గాజులరేగ పరిధిలో గాంధీ వేదిక ప్రాంగణం వద్ద రెవెన్యూ సదస్సులు జరగనున్నాయి. అలాగే 22వ తేదీన వీటి అగ్రహారం పరిధిలో రొంగలి వీధి ఆంజనేయస్వామి ఆలయం వద్ద రెవెన్యూ సదస్సులు నిర్వహించనున్నట్లు అధికారులు ప్రణాళికలు సిద్ధం చేశారు. ఈ సదస్సులను పురస్కరించుకొని కార్పొరేషన్ రెవెన్యూ అధికారులు, సిబ్బంది, అలాగే తహసీల్దార్, డిప్యూటీ తహసీల్దార్, ఆర్ఐ, సర్వేయర్, అటవీ, వక్ఫ్ బోర్డ్, దేవదాయ, రిజిస్ట్రేషన్ శాఖల అధికారులతో పాటు ఇతర ప్రభుత్వ శాఖల అధికారులు సిబ్బంది పాల్గొననున్నారు. ముందుగా ఆయా డివిజన్ ప్రాంతంలో పర్యటించి ప్రజలకు అవగాహన కల్పించిన అనంతరం రెవెన్యూ సదస్సులు నిర్వహించే ప్రాంగణానికి అధికారులు చేరుకోనున్నారు. ఈ రెవెన్యూ సదస్సులలో ప్రజల నుంచి భూ వ్యవహారాలకు సంబంధించిన ఫిర్యాదులను స్వీకరించి అక్కడికక్కడే పరిష్కరించనున్నారు. అలాగే కోర్టు ఇతర కేసుల వ్యవహారాలను కూడా పరిశీలించి తగు పరిష్కారం చూపించనున్నట్లు పేర్కొన్నారు. ఫిర్యాదుదారుడు ఇచ్చిన వివరాలను, ఫిర్యాదులను ఆన్‌లైన్‌లో నిక్షిప్తం చేసి అవసరమైన రసీదును ప్రతి ఫిర్యాదుదారునికి అందించనున్నారు.

వీఆర్ఓలే కీలకం

రెవెన్యూ సదస్సులను విజయవంతంగా నిర్వహించేందుకు వీఆర్వోలు ప్రత్యేక కృషి చేయాలని విజయనగరం కార్పొరేషన్ కమిషనర్ పల్లి నల్లనయ్య పేర్కొన్నారు. ఈ మేరకు గురువారం కార్పొరేషన్ కార్యాలయంలో తహసీల్దార్ కూర్మనాథ్‌తో కలిసి వీఆర్ఓలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శుక్రవారం నుంచి విజయనగరం కార్పొరేషన్ పరిధిలో రెవెన్యూ సదస్సులు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ముఖ్యంగా ప్రజల నుంచి వచ్చిన దరఖాస్తులను తక్షణమే పరిశీలించే విధంగా వీఆర్ఓలు ప్రత్యేక శ్రద్ధ కనబరచాలన్నారు. సదస్సులకు నిర్ణీత సమయం కన్నా ముందుగా చేరుకోవాలని చెప్పారు. అలాగే వార్డు సందర్శనలో కీలక పాత్ర పోషించాలని సూచించారు. తహసీల్దార్ కూర్మనాథ్ మాట్లాడుతూ నిర్దేశిత గడువు కన్నా ముందుగానే భూ సంబంధ సమస్యలు పరిష్కారం దిశగా చర్యలు చేపట్టాలన్నారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికలో భూ సంబంధ ఫిర్యాదులే ఎక్కువగా వస్తున్నాయని దీనిపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టిని కేంద్రీకరించి భూ సమస్యల పరిష్కారానికి వేదికగా రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తుందన్నారు. సమావేశంలో అసిస్టెంట్ సిటీ ప్లానర్‌లు రమణమూర్తి, హరిబాబు, సర్వేయర్ సింహాచలం పాల్గొన్నారు.

ఆట, పాటలతో కూడిన విద్యనందించాలి



అంగన్‌వాడీ కేంద్రంలోని చిన్నారులను పరీక్షిస్తున్న ఏసీడీపీఓ

భోగాపురం: అంగన్‌వాడీ కేంద్రాలలోని చిన్నారులకు ఆట, పాటలతో కూడిన విద్యను అందించాలని ఏసీడీపీఓ ఎం.సత్యవతి అన్నారు. గురువారం ఆమె మండల కేంద్రం పెదహరిజనపేటలోని అంగన్ కేంద్రాన్ని తనిఖీ చేశారు. అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు అందిస్తున్న పౌష్టికాహారాన్ని ఆరా తీశారు. బొమ్మలు మరియు ఆట ఆధారిత కార్యక్రమాల ద్వారా చిన్నారుల్లో సమగ్ర అభివృద్ధి, శారీరక, భావోద్వేగ, సామాజిక, సృజనాత్మక నైపుణ్యాలను పెంపొందించేలా ప్రారంభ బాల్య సంరక్షణ విద్యను అందించాలని అంగన్‌వాడీ కార్యకర్తలకు సూచించారు. అనంతరం రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు పి.యశోద, వరం, అనురాధ, ఆయాలు ఉమా, గోవిందమ్మ పాల్గొన్నారు.

నేడు గిరిజన సంక్షేమ శాఖ మంత్రి పర్యటన

సీతంపేట: గిరిజన సంక్షేమ శాఖ మంత్రి శుక్రవారం సీతంపేట మండలంలో పర్యటించనున్నట్టు ఐటీడీఏ పీఓ యశ్వంత్‌కుమార్ రెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 గంటలకు ఐటీడీఏలో వివిధ శాఖాధికారులతో సమీక్షించనున్నట్టు పేర్కొన్నారు. అనంతరం స్థానిక కార్యక్రమాల్లో పాల్గొని, ముక్కిడిపోలమ్మ వీడీవీకే కేంద్రాన్ని సందర్శించనున్నట్టు తెలిపారు.

పూర్వ ప్రాథమిక విద్యపై ప్రత్యేక దృష్టి



అంగన్‌వాడీ కేంద్రంలో సిబ్బందితో మాట్లాడుతున్న ప్రత్యేకాధికారి అరుణ

విజయనగరం రూరల్: మాతా శిశు సంక్షేమమే ప్రధాన ధ్యేయంగా పని చేస్తున్న అంగన్‌వాడీ కేంద్రాలలో పూర్వప్రాథమిక విద్యపై సిబ్బంది దృష్టి సారించాలని మండల ప్రత్యేక అధికారి అరుణకుమారి అన్నారు. మండలంలోని చెల్లూరు గ్రామంలో గురువారం నిర్వహించిన గ్రామ సందర్శనలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముందుగా ప్రభుత్వ పాఠశాలలో అందిస్తున్న విద్య, మధ్యాహ్న భోజనాన్ని రుచి చూశారు. విద్యార్థులకు బోధన సక్రమంగా ఉండటం లేదని వచ్చిన ఫిర్యాదుపై స్థానిక ఉపాధ్యాయులతో మాట్లాడారు. పాఠశాలలో మౌలిక వసతులు లేమి కనపడుతోందన్నారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించి పూర్వ ప్రాథమిక విద్య చిన్నారులకు సక్రమంగా అందడం లేదని తెలిసి సిబ్బందిని హెచ్చరించారు. కార్యక్రమంతో ఎంపీడీఓ తిరుపతిరావు తదితరులు పాల్గొన్నారు

18వ డివిజన్‌లో ఏసీ పర్యటన



వార్డు పర్యటనలో అధికారులు, స్థానిక కార్పొరేటర్‌లు

విజయనగరం: నగరంలోని 18వ డివిజన్‌లో గురువారం జరిగిన వార్డు పర్యటనలో కార్పొరేషన్ అసిస్టెంట్ కమిషనర్ సీహెచ్ తిరుమలరావు పాల్గొన్నారు. హుకుంపేట నుంచి ప్రారంభమైన వార్డు పర్యటనలో స్థానిక సమస్యలను తెలుసుకున్నారు. ప్రజలకు ఉపయుక్తంగా ఉండే కాలువలు, రహదారులు పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. కొన్నిచోట్ల తాగునీరు సక్రమంగా సరఫరా జరగటం లేదని ప్రజలు తెలిపారని వాటిని సరి చేయాల్సి ఉందని చెప్పారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రాన్ని, మధ్యాహ్నం భోజన పథకం అమలును పరిశీలించారు. ఈ సందర్భంగా అసిస్టెంట్ కమిషనర్ సిహెచ్ తిరుమలరావు మాట్లాడుతూ కలెక్టర్ ఆదేశాల మేరకు ప్రతి గురువారం వార్డు పర్యటనలు చేపడుతున్నామన్నారు. తమ పర్యటనలో గమనించిన క్షేత్ర స్థాయి సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి అవి పరిష్కారం అయ్యే విధంగా చూస్తామన్నారు. స్థానిక కార్పొరేటర్ మీసాల రమాదేవి మాట్లాడుతూ తమ డివిజన్‌లో క్షేత్ర స్థాయిలో ఉన్న సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువెళ్లామని, అవి పరిష్కారం అవుతాయన్న ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. పర్యటనలో కార్పొరేషన్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

మహిళలకు అండగా వన్ స్టాప్ సెంటర్



కార్యక్రమంలో మాట్లాడుతున్న రమాదేవి

విజయనగరం ఫోర్ట్: ఆపదలో ఉన్న మహిళలకు అండగా వన్ స్టాప్ నిలుస్తుందని వన్‌స్టాప్ సెంటర్ కౌన్సిలర్ కిల్లాడ రమాదేవి అన్నారు. గురువారం ఎంఎస్ఎన్ కళాశాలలో నిర్వహించిన సదస్సులో ఆమె మాట్లాడారు. మహిళలకు రక్షణ, సంరక్షణ వన్ స్టాప్ సెంటర్ ద్వారా కల్పిస్తామన్నారు. బాల్య వివాహాలు ఎక్కడైనా జరిగితే 1098 ఫోన్ నంబరుకుగాని, పోలీసులకుగాని తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో కేస్ వర్కర్ అనిత తదితరులు పాల్గొన్నారు.

మెగా పేరెంట్స్ - టీచర్స్ డే రేపు

- కమిషనర్ పి.నల్లనయ్య

విజయనగరం: విజయనగరం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఉన్న అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో ఈ నెల 7వ తేదీన మెగా పేరెంట్స్ అండ్ టీచర్స్ సమావేశాలు నిర్వహించాలని కమిషనర్ పల్లి నల్లనయ్య స్పష్టం చేశారు. ఈ మేరకు ఆయన కార్యక్రమ వివరాలను వెల్లడించారు. అన్ని ప్రాథమిక, ప్రాథమికోన్నత, జిల్లా పరిషత్, సాంఘిక సంక్షేమ పాఠశాలలు, కేంద్రీయ విద్యాలయాలలో 7న మెగా పేరెంట్స్ అండ్ టీచర్స్ మీటింగ్ జరగనున్నట్లు తెలిపారు. పండగ వాతావరణంలో పాఠశాలల ఆవరణలో కార్యక్రమం ఉత్సాహభరితంగా సాగాలని ప్రభుత్వం ఆదేశించిందన్నారు. పిల్లల్ని ఉత్తేజపరిచే విధంగా ఉపన్యాసాలు, ఉపాధ్యాయుల బోధనా తీరును పరిశీలించడం, అవసరమైన సూచనలు సలహాలు ఇవ్వడం ఈ కార్యక్రమ ముఖ్య ఉద్దేశంగా పేర్కొన్నారు. ఆటపాటలతో పాటు విద్యార్థులు, ఉపాధ్యాయులు సమన్వయంతో కార్యక్రమం నిర్వహించనున్నట్లు చెప్పారు. విద్యార్థులందరికీ హోలీస్టిక్ ప్రోగ్రెస్ కార్డులు అందజేయడం జరుగుతుందన్నారు. కలెక్టర్ ఆదేశాలతో, జిల్లా విద్యాశాఖ అధికారి ద్వారా సంబంధిత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులకు కార్యక్రమ నిర్వహణకై ఇది వరకే స్పష్టమైన ఆదేశాలు జారీ చేయడం జరిగిందన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమం విజయవంతం చేయాలని ఆయన కోరారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పూసపాటిరేగ : మండలంలోని నాతవలస సబ్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడనున్నట్టు విద్యుత్ శాఖ ఈఈ సురేష్ గురువారం ఒక ప్రకటనలో తెలియపారు. పూసపాటిరేగ టౌన్, పూసపాటిపాలెం, ఎరుకొండ, పసపాం, నడిపల్లి, కోనాడ, కిలుగుపేట, కాలపురెడ్డిపేట, వెల్దూరు, తిప్పలవలస గ్రామాలతో పాటు, పి.రేగ వ్యవసాయ లైన్‌లకు మరమ్మతులు చేయనున్నందున విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

డెంకాడలో..

డెంకాడ: మండలంలోని చింతలవలస ఐదో ఏపీఎస్పీ బెటాలియన్ విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో ఉన్న పలు గ్రామాలకు శుక్రవారం ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేయనున్నట్టు విజయనగరం ఏపీఈపీడీసీఎల్ ఈఈ జి.సురేష్‌బాబు తెలిపారు. విద్యుత్ లైన్‌లు నిర్వహణ పనుల కారణంగా బొడ్డవలస, వెలంపేట, బూర్లవాని కళ్లాలు గ్రామాలకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందన్నారు.

భోగాపురంలో..

భోగాపురం: విద్యుత్ లైన్ల మరమ్మతులు చేపట్టనున్న నేపథ్యంలో మండల పరిధిలోని సవరవిల్లి, రావాడ, ఉప్పాడపేట, బసవపాలెం, తూడెం, కవులవాడ తదితర గ్రామాల్లో శుక్రవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు ఏపీఈపీడీసీఎల్ ఈఈ జి.సురేష్‌బాబు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

నెల్లిమర్లలో రూరల్‌లో..

నెల్లిమర్ల రూరల్: మండలంలోని సారిపల్లి 11 కేవీ రూరల్ ఫీడర్ పరిధిలో ఎల్‌సీ మరమ్మతులను శుక్రవారం నిర్వహిస్తున్నామని ఆ శాఖ డీఈఈ పి.త్రినాధరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కారణంగా సారిపల్లి, నీలంరాజుపేట, తారక రామతీర్థ సాగర్ ప్రాజెక్టు, సారిపల్లి వాటర్ వర్క్స్, కుదిపి ప్రాంతాలకు ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

అంకితభావంతో పనిచేస్తేనే గుర్తింపు



సూర్యకాంతంను సన్మానిస్తున్న హెచ్ఎం నరసింగరావు, ఉపాధ్యాయులు

భోగాపురం: విధుల్లో అంకితభావంతో పనిచేసినప్పుడే మంచి గుర్తింపు లభిస్తుందని ముక్కాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్ఎం జి.నరసింగరావు అన్నారు. మండలంలోని ముక్కాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయురాలిగా విధులు నిర్వహిస్తూ ఉద్యోగ విరమణ చేసిన ఉపాధ్యాయురాలు పీవీ సూర్యకాంతను హెచ్ఎం నరసింగరావుతో పాటు తోటి ఉపాధ్యాయులు గురువారం జ్ఞాపికలు అందజేసి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సూర్యకాంతం విద్యార్థులకు విధివిధానాలతో బోధన అందించడంతో పాటు పాఠశాల అభివృద్ధికి విశేష కృషి చేశారని కొనియాడారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఎస్.నళిని, వి.కృష్ణ, ఎస్.భవానీ, జె.గణపతి, కె.లక్ష్మణరావు, ఎస్.లక్ష్మి, వై.మల్లికార్జునరావు, ఎల్.పార్వతిదేవి, అనసూయ, అప్పారావు, సీఆర్‌పీ మాత శేషుబాబు, తదితరులు పాల్గొన్నారు.

గ్రీన్ అంబాసిడర్ల ఆందోళన



తమ సమస్యలను తక్షణమే పరిష్కరించాలని డిమాండ్లు చేస్తూ గ్రీన్ అంబాసిడర్లు పూసపాటిరేగ మండల పరిషత్ కార్యాలయం వద్ద సీఐటీయూ ఆధ్వర్యంలో ఆందోళన చేశారు. జీఓ నంబరు 680 ప్రకారం రూ.10వేలు గౌరవ వేతనం చెల్లించాలని, పెండింగ్‌లో ఉన్న వేతనాలను వెంటనే జమ చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం నేరుగా కార్మికుల ఖాతాల్లో జీతాలు జమ చేయాలని కోరారు. పంచాయతీల జనాభాకు అనుగుణంగా కార్మికుల సంఖ్యను పెంచాలని కోరారు. ఆందోళనలో సీఐటీయూ నాయకుడు బి.సూర్యనారాయణ, పలువురు గ్రీన్ అంబాసిడర్లు పాల్గొన్నారు.
– పూసపాటిరేగ

మహిళా వలంటీర్ల మౌన దీక్ష



ఆడబిడ్డలు కన్నీళ్లు పెట్టకుండా చూసుకుంటానని గొప్పలు చెప్పిన పవన్‌కల్యాణ్‌కి రాష్ట్రంలో రెండు లక్షల మంది మహిళా వలంటీర్ల కన్నీళ్లు కనిపించడం లేదా..! వారి ఆవేదన ఆయన చెవికి వినపడలేదా..! అని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి బుగత అశోక్ డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌ను ప్రశ్నించారు. వలంటీర్లకు కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయడంలో నిర్లక్ష్యాన్ని నిరసిస్తూ విజయనగరంలో ఏపీ గ్రామ, వార్డు సచివాలయ వలంటీర్ల యూనియన్ ఆధ్వర్యంలో స్థానిక స్టేట్ బ్యాంక్ మెయిన్ బ్రాంచ్ దగ్గర గాంధీ విగ్రహం దగ్గర నల్ల రిబ్బన్లు నోటికి ధరించి రెండు గంటల పాటు మౌన దీక్ష గురువారం చేశారు. తమకు న్యాయం చేయాలని కోరారు. ఎన్నికల సమయంలో వలంటీర్లకు ఇచ్చిన హామీలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మహిళా వలంటీర్లు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. – విజయనగరం ఫూల్‌బాగ్

ప్రకృతి వ్యవసాయంతో బహుళ ప్రయోజనాలు



ప్రకృతి వ్యవసాయంపై సిబ్బంది, రైతులకు అవగాహన కల్పిస్తున్న రీజనల్ కోఆర్డినేటర్ ప్రకాష్

- రీజనల్ కోఆర్డినేటర్ ప్రకాష్

డెంకాడ: ప్రకృతి వ్యవసాయంతో పంటల సాగు వలన బహుళ ప్రయోజనాలు ఉంటాయని ప్రకృతి వ్యవసాయం రీజనల్ కో ఆర్డినేటర్ ప్రకాష్ అన్నారు. మండలంలోని అమకాంలో ప్రకృతి వ్యవసాయం శిక్షకులు గౌరి క్షేత్రంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బందికి ఏటీఎం, ఏ గ్రేడ్, డ్రాట్ ప్రూఫ్ మోడల్‌లో సాగుపై శిక్షణ జరిగింది. కార్యక్రమంలో రీజనల్‌య కో ఆర్డినేటర్ ప్రకాష్ మాట్లాడుతూ ఏటీఎం విధానంలో భాగంగా ఒకే పొలంలో 26 రకాల పంటలు సాగు చేయడం ద్వారా నెలకు రూ.20వేల వరకూ ఆదాయం సంపాదించవచ్చని వివరించారు. ఏ గ్రేడ్ మోడల్ ఐదు రకాల ప్రధాన పంటలతో మిగిలిన వాటిని కూడా సాగు చేయడం ద్వారా ప్రతీ ఎకరంలో ఏడాది రూ.లక్ష సంపాదించవచ్చని వివరించారు. డ్రాట్ ప్రూఫ్ విధానంలో తక్కువ నీటిని వినియోగించి సాగు చేయగల బీర ఆర, కంది, ఆనప, గుమ్మడి ఐదు రకాల పంటలను సాగు చేయడం ద్వారా ఆదాయం పొందవచ్చని తెలిపారు. ప్రకృతి వ్యవసాయ పద్ధతుల్లో పంటల సాగు చేయడం వలన పురుగు మందులు ఎరువులు ఖర్చు లేకుండా ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ దిండి కోటి, ఎన్ఎఫ్ఏ మెరిసి, మాస్టర్ ట్రైనర్ వెంకటలక్ష్మి, మెంటర్ గౌరి, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

విద్యుత్ ఒప్పందాన్ని రద్దు చేయాలి : సీపీఎం



నిరసన వ్యక్తం చేస్తున్న సీపీఎం నాయకులు, ప్రజలు

విజయనగరం ఫూల్‌బాగ్: అదానీతో చేసుకున్న విద్యుత్ ఒప్పందాన్ని కూటమి ప్రభుత్వం రద్దు చేయాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు ఎ.జగన్ మోహన్‌రావు డిమాండ్ చేశారు. స్మార్ట్ మీటర్ల యోచనను విరమించుకోవాలని కోరారు. కామ్రేడ్ డి.బుచ్చయ్య అధ్యక్షతన స్థానికంగా గురువారం జరిగిన శాఖ సమావేశంలో ట్రూ అప్ చార్జీలు, సర్దుబాటు చార్జీల పేరుతో విద్యుత్ భారాలను ప్రజలపై వేయడాన్ని ఖండిస్తూ నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా జగన్‌మోహన్‌రావు, వి.లక్ష్మి మాట్లాడుతూ నిత్యావసర సరుకుల ధరలు తగ్గించడంలో కూటమి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని, ట్రూ అప్, సర్దుబాటు, సర్ చార్జీల పేరుతో ప్రజలపై రూ.వేల కోట్ల విద్యుత్ భారాలు వేస్తుందని దుయ్యబట్టారు. అదానీ స్మార్ట్ మీటర్లను ప్రభుత్వ కార్యాలయాలు, వాణిజ్య సంస్థలకు ఏర్పాటు చేస్తున్నారని, ఇళ్లకు కూడా వేసే ప్రయత్నం అధికారికంగా చేస్తున్నారని చెప్పారు. ప్రజలంతా అప్రమత్తమై స్మార్ట్ మీటర్లను అడ్డుకోవాలని పిలుపునిచ్చారు. సెల్‌ఫోన్ మాదిరి రీచార్జీతో మొత్తం ప్రజల సంపదను అదానీకి దోచిపెట్టే ఒక దుర్మార్గమైన కుట్రలో భాగమే స్మార్ట్ మీటర్లని, ప్రభుత్వం దీనిపై ముందుకువెళ్తే.. మరో విద్యుత్ పోరాటానికి సిద్ధం కావాల్సి ఉంటుందని హెచ్చరించారు. సీపీఎం సభ్యులు జి.సింహాచలం, సీహెచ్ హరీష్, వెంకటమ్మ, రాజు, కమల, సీతమ్మ పాల్గొన్నారు.